నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
3 | కరీంనగర్, శుక్రవారం 28 జూన్ 2024 | RAJANNA SIRCILLA

# గనుల వేలంపై పోరుబాట



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కోల్‌బెల్ట్ ఏరియా బీఆర్ఎస్ నాయకులు, టీబీజీకేఎస్ నాయకులతో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల

## వచ్చే నెల ఒకటి నుంచి టీబీజీకేఎస్ నిరసనలు

- సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్
- హైదరాబాద్ మీటింగ్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్ణయం

*సింగరేణి బొగ్గు గనుల వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా వచ్చే నెల ఒకటి నుంచి టీబీజీకేఎస్ పోరుబాట పట్టబోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆందోళనకు దిగుతున్నది. ఒకటిన నల్లబ్యాడ్జిలతో నిరసన, అధికారులకు వినతిపత్రాలు అందజేత, 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 9న గోదావరిఖనిలో భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నది. ఈ మేరకు కార్యక్రమ వివరాలను టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి వెల్లడించారు. గోదావరిఖని ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు.*

గోదావరిఖని, జూన్ 27: గనుల వేలానికి వ్యతిరేకంగా టీబీజీకేఎస్ చేపట్టే ధర్నాకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన కోల్‌బెల్ట్ ఏరియా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, టీబీజీకేఎస్ రాష్ట్ర, డివిజన్ కమిటీ నాయకుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చినట్టు టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. బొగ్గు గనుల వేలంతో సింగరేణి సంస్థ ఉనికికి పెను ప్రమాదం ఏర్పడబోతున్న నేపథ్యంతో ఆందోళనకు సంపూర్ణంగా సహకరిస్తామన్నారని వివరించారు. తెలంగాణ ఉద్యమంలో గని కార్మికుల పాత్రను కేటీఆర్ కొనియాడారని వివరించారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర చేస్తున్నాయని, సింగరేణి పరిరక్షణకు, కార్మికుల ఉపాధి, భద్రత కోసం ఎంతటి పోరాటానికి వెనుకాడేది లేదని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు రాజిరెడ్డి వెల్లడించారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ, నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, సురేందర్‌రెడ్డి, పర్లపల్లి రవి, బీ సంపత్‌కుమార్, రాజశేఖర్, వడ్డెపల్లి శంకర్, చల్ల రవీందర్‌రెడ్డి, భేతి చంద్రయ్య, పింగళి సంపత్‌రెడ్డి, చెల్పూర్తి సతీశ్, గనుల డివిజన్ల ఉపాధ్యక్షులు మల్రాజు శ్రీనివాసరావు, మేడిపల్లి సంపత్, పెట్టం లక్ష్మణ్, సంపత్‌రెడ్డి, బడిత సమ్మయ్య, నాగెల్లి వెంకట్, గడప రాజయ్య, శ్రీనివాసరావు, జాఫర్ హుస్సేన్ ఉన్నారు.

# ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ హఠాన్మరణం

- విధుల్లో ఉండగానే గుండెపోటు
- శ్రీరాములపల్లిలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



మేకల శ్రీనివాస్

కరీంనగర్ రాంనగర్/ ఇల్లందకుంట జూన్ 27: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ మేకల శ్రీనివాస్(51) హఠాన్మరణం చెందాడు. విధి నిర్వహణలో ఉండగా బుధవారం రాత్రి చాతిలో నొప్పితో కుప్పకూలాడు. తోటి సిబ్బంది దవాఖానకు తరలిస్తుండగా మరణించాడు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన శ్రీనివాస్ 1995లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. ఆయనకు భార్య శ్రీలత, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. గురువారం ఉదయం శ్రీనివాస్ మృతదేహాన్ని శ్రీరాములపల్లికి తరలించి పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. అడిషనల్ డీసీపీ (ఏఆర్) అశోక్ జైన్ పాల్గొన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా ₹25 వేలు అందజేశారు. శ్రీనివాస్ కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల్లో రిజర్వు ఇన్‌స్పెక్టర్ మోడెం సురేశ్, ఆర్ఎస్ఐ సురేశ్, ఫ్యునరల్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇద్దరు అధికారుల సస్పెన్షన్

**విధుల్లో నిర్లక్ష్యం ఫలితం**

పెద్దపల్లి, జూన్27: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన ఇద్దరి జిల్లా అధికారులపై వేటుపడ్డది. పెద్దపల్లి జిల్లా భూగర్భ జల శాఖ అధికారి కే రవి శంకర్, జిల్లా ఆడిట్ అధికారి ఎం సురేశ్‌బాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సమీకృత కలెక్టరేట్‌లో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో భూగర్భ జల, జిల్లా ఆడిట్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైనట్టు గుర్తించారు. బయోమెట్రిక్ అటెండెన్స్, సంబంధిత కార్యాలయాల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. పది రోజులుగా సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్నట్టు గుర్తించారు. అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ బీ ఉమాదేవికి భూగర్భ జిల్లా అధికారి చార్జ్, అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్ రవిబాబుకు జిల్లా ఆడిట్ అధికారి చార్జ్ అప్పజెప్పాలని ఆదేశించారు. విచారణ పూర్తయ్యేదాకా అధికారులు హెడ్‌క్వార్టర్‌ను వదిలి వెళ్లవద్దని నిర్దేశించారు



ఆలయ అధికారులకు విరాళానికి సంబంధించిన చెక్కును అందజేస్తున్న భక్తుడు గల్ల గుండయ్య

# రాజన్న భక్తుడి భారీ విరాళం

- నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ₹25లక్షలు, గోశాలకు ₹10 లక్షలు
- వితరణ చేసిన సికింద్రాబాద్‌కు చెందిన గల్ల గుండయ్య

వేములవాడ టౌన్, జూన్ 27: వేములవాడ రాజన్న భక్తుడు ఆలయానికి భారీ విరాళాన్ని అందించారు. సికింద్రాబాద్‌కు చెందిన గల్ల గుండయ్య నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ₹25లక్షలు, గోశాల నిర్వాహణకు ₹10లక్షలు వితరణ చేశారు. గురువారం ఇందుకు సంబంధించిన చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. ఆశీర్వచనం అందించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఇక్కడ ఆలయ ఏఈవో ప్రతాప నవీన్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.

## కాంగ్రెస్ అధిష్టానంపై
# రగులుతున్న జీవన్‌రెడ్డి వర్గం!



- రాజీనామాపై వెనక్కి తగ్గిన ఎమ్మెల్సీ
- అయినా ఆయన వర్గీయులు, పార్టీ శ్రేణుల్లో ఆందోళన
- విధేయతను అవమానించారంటూ ఆగ్రహం
- ఎమ్మెల్యేకే ప్రయార్టీ ఇవ్వాలని ఓ మంత్రి ఆదేశాలపై గరంగరం!
- నామినేటెడ్ పోస్టులపై ఆశవాహుల్లో ఆందోళన
- వదిలిపెట్టే ప్రసక్తి లేదంటున్న కార్యకర్తలు

*జగిత్యాలలో రాజకీయ వేడి రాజుకున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సంజయ్ చేరికతో కాంగ్రెస్‌లో చిచ్చు రగులుతున్నది. తనకు ఏమాత్రం సమాచారం లేకుండా తన ప్రత్యర్థిని చేర్చుకోవడంతో రాజీనామాకు సిద్ధమై, పార్టీ పెద్దల జోక్యంతో జీవన్ రెడ్డి వెనక్కి తగ్గినా శ్రేణుల్లో మాత్రం అధిష్టానంపై ఆగ్రహం పెల్లుబికుతూనే ఉన్నది. అధికారం చేతిల ఉన్నదని పదేళ్లు తమను అరిగోస పెట్టిండని, కేసులతో వేధించిండని, అలాంటి వ్యక్తిని ఎలా చేర్చుకున్నారంటూ కార్యకర్తలు ఆవేదనతో ప్రశ్నిస్తుండగా.. మరోవైపు నలభై ఏండ్లు జీవన్‌రెడ్డితో కలిసి పార్టీ కోసం పనిచేశామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని ఆయన వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. నామినేట్ పదవులు, స్థానిక ఎన్నికల్లో సంజయ్ వర్గానికి ప్రాధాన్యతనిస్తే తమ ఆశలు అడియాశలే అవుతాయని ఆశావహులు వాపోతున్నారు.*

జగిత్యాల, జూన్ 27, (నమస్తే తెలంగాణ) : పదేండ్లుగా జగిత్యాల నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరు సంజయ్‌కుమార్ రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న విషయం తెలిసిందే. గతంలో జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి రమణ, రాజేశంగౌడ్ రాజకీయంగా పోటీపడ్డా.. అది రాజకీయంగానే ఉండేది. కక్షలు, కార్పణ్యాలకు పోలేదు. కానీ, జీవన్‌రెడ్డి, సంజయ్ మధ్య పోటీ మాత్రం వ్యక్తిగత కక్షలు, స్పర్థగా మారిందనే అభిప్రాయం ఏర్పడింది. వీరిద్దరి మధ్య ప్రతి అంశంలోనూ తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. అవి ఇరు పార్టీల కార్యకర్తలు, అనుచరుల వరకు విస్తరించాయి. దీంతో ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి చేరింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సంజయ్ గెలువడం, జీవన్‌రెడ్డి ఓడిపోవడం, అయితే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జగిత్యాలలో రాజకీయాల పరిస్థితి మారింది. కొందరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైతం అధికార పార్టీలో చేరిపోయారు. ఈ క్రమంలో సంజయ్ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే ఏ మాత్రం సమాచారం లేకుండా సంజయ్‌ను చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు తీవ్ర మనస్తాపం చెందారు. ఈ క్రమంలో రాజీనామా చేస్తానని జీవన్‌రెడ్డి పట్టుబట్టడంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి దిగి.. ఏకంగా ఢిల్లీకి పిలిపించి సంప్రదింపులు చేయడంతో చివరకు ఆయన వెనక్కితగ్గారు. అయితే జీవన్‌రెడ్డికి ఎలాంటి హామీ ఇవ్వకుండానే, కార్యకర్తల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండానే సంజయ్‌ను చేర్చుకోవడంపై కార్యకర్తలు రగిలిపోతూనే ఉన్నారు. సీనియార్టీ, సిన్సియార్టీని అవమానించి, ఇన్నాళ్లు తమపై యుద్ధం ప్రకటించిన ప్రత్యర్థికి అందలం ఎక్కించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. నలభై ఏండ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన జీవన్‌రెడ్డిని అవమానించడాన్ని రాజకీయ విశ్లేషకులు సైతం తప్పు పడుతున్నారు.

### ఎమ్మెల్యేకే ప్రయార్టీ ఇవ్వండని ఓ మంత్రి ఆదేశాలు!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ప్రాధాన్యత పెరిగింది. అధికారులతోపాటు ప్రజలు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం ఇతరత్రా కార్యక్రమాల కోసం ఎమ్మెల్సీనే ఎక్కువగా కలువడం కనిపిస్తున్నది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడంతో ప్రజలు ఆయనను కలువడం గతంతో పోలిస్తే తగ్గింది. అధికారులు ప్రొటోకాల్ పరంగా ఎమ్మెల్యేను పరిగణలోకి తీసుకుంటున్నా, ఎక్కువగా ఎమ్మెల్సీకే ప్రయార్టీ ఇస్తున్నట్టు స్పష్టమవుతున్నది. ఈ నెల 23న సంజయ్ కాంగ్రెస్‌లో చేరడంతో పరిస్థితి మారింది. కండువా కప్పుకోగానే తనకు నియోజకవర్గంలో ఎక్కువ ప్రయార్టీ కావాలని, ప్రొటోకాల్‌తోపాటు అన్ని తన చేతుల మీదుగా జరగాలని సంజయ్ కోరినట్టు తెలుస్తున్నది. దీంతో రాష్ట్రంలోనే చేరికల మంత్రిగా చక్రం తిప్పుతున్న ఓ నేత జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి.. పార్టీలో చేరిన ఎమ్మెల్యేకే ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అంతే కాకుండా పది రోజుల వ్యవధిలో తాను స్వయంగా జగిత్యాలకు వచ్చి అధికారులతో సమీక్షిస్తానని అధికారులకు చెప్పినట్టు సమాచారం. ఈ విషయం బయటికి తెలియడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రగిలిపోతున్నారు. పొలాసకు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ, పదేండ్లు అధికారం వెలగబెట్టి, ఇప్పుడు మళ్లీ అధికారం కోసం వెంపర్లాడే వ్యక్తిని చూస్తే అసహ్యం వేస్తుందని వాఖ్యానించడం గమనార్హం.

### నామినేటెడ్ పదవులు దక్కేనా..?

పదేండ్లపాటు నానాకష్టాలు పడి, పార్టీని గట్టెక్కించిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎంపీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సైతం జగిత్యాల నియోజకవర్గ పరిధితోపాటు జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా 36 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ నాయకుడిని, అలాగే జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వెలమ సామాజిక వర్గానికి చెందిన ఓ సీనియర్ నాయకుడిని, వైస్ చైర్మన్‌గా రాయికల్‌కు చెందిన ఓ నాయకుడిని చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి అధిష్టానానికి నివేదించినట్టు సమాచారం. అలాగే మరికొన్ని పోస్టులకు సైతం నాయకులను, పార్టీ విధేయులను ఎంపిక చేసినట్టు తెలుస్తున్నది. అయితే హఠాత్తుగా సంజయ్ చేరడం, ఇకపై 'ఎమ్మెల్యేనే సుప్రీం' అంటూ ఓ మంత్రి ఆదేశాలు ఇవ్వడంతో ఆశావహుల నెత్తిన పిడుగు పడినట్టయింది. వారం పది రోజుల్లో నియామకం పూర్తవుతుందనుకున్న తరుణంలో ఈ పరిస్థితులను చూసి కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. పదేండ్లుగా తాము పడ్డ కష్టం బూడిదలో పోసిన పన్నీరేనని, నమ్మిన పార్టీ తమకు తీవ్ర అన్యాయం చేసిందని వాపోతున్నారు.

### స్థానిక ఆశలు గల్లంతేనా..?

స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపు ఎలా ఉంటుంది? అనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సింగిల్ విండోలు, కౌన్సిలర్లు, చైర్మన్లు ఇలా అన్ని విభాగాల్లోనూ పదవులను ఆశిస్తున్న వారు వందల మంది ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో స్థానిక సంస్థల్లో పార్టీ టికెట్ వచ్చినా.. తమను బలపరిచినా ఈజీగా గెలుస్తామని ఆశావహులు భావిస్తున్నారు. అయితే పార్టీకి లాయల్‌గా పనిచేసిన నేపథ్యంలో తమకు టికెట్ వస్తుందని ఇన్నాళ్లూ ఆశించారు. ఐదు రోజుల క్రితం సంజయ్ చేరడం, ఆయన వెంట ఆయన అనుచరగణం రానుండడంతో రేపటి రోజున తమకు టికెట్లు వస్తాయా..? ఎమ్మెల్యే తన వర్గం వారికి ప్రాధాన్యతనిస్తే తమ పరిస్థితి ఏంటి? అని ఆందోళన చెందుతున్నారు. అయితే తమ పార్టీలోకి వచ్చి షాక్ ఇవ్వడం తోపాటు తమపైనే ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్న వారిని అంత సులువుగా వదిలిపెట్టమని, వారికి తగిన శాస్తి చేసి తీరుతామని జీవన్‌రెడ్డి వర్గీయులు, కార్యకర్తలు, నాయకులు తమ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నీట్ రద్దు చేయాల్సిందే




కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో తెలంగాణ విద్యాపరిరక్షణ సమితి ప్రతినిధులు

- లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట విద్యాపరిరక్షణ సమితి ధర్నా

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 27: అక్రమాలు, అవకతవకలకు ఆలవాలంగా మారిన వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్, దీనిని నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. నీట్ లీకేజీపై కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన ప్రదర్శనకు దిగింది. 'కామన్ ఎడ్యుకేషన్ లేనప్పుడు కామన్ పరీక్షలెందుకు? పేపర్ లీకేజీకి బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలి.' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఈసీ స్టేట్ స్టీరింగ్ కమిటీ మెంబర్ వైద్యుల రాజిరెడ్డి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేసేందుకు కంకణం కట్టుకున్నదని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కామన్ విద్యావిధానాన్ని అమలు చేసి విద్యారంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకొనేందుకు కుట్రలు చేస్తున్నదని నిప్పులు చెరిగారు. గతంలో ఎంబీబీఎస్‌లో ప్రవేశాలను ఆయా రాష్ట్రాలే నిర్వహించుకునేవని, భారతీయ వైద్య మండలి ప్రక్షాళన పేరిట మార్పులంటూ ఏజెన్సీ సంస్థ ఎన్టీఏకు అప్పగించడం సిగ్గుచేటన్నారు. పరీక్షల నిర్వహణ సామర్థ్యం లేకపోవడంతో 24 లక్షల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషలో ప్రవేశపరీక్ష రాసే అవకాశం కల్పించినా ఉత్తరాది రాష్ట్రాల్లో పేపర్ లీక్ చేసి విద్యార్థుల బతుకులతో చెలగాటమాడుతున్నదన్నారు. టీఎస్ఈసీ రాష్ట్ర బాధ్యుడు మాడుగుల రాములు మాట్లాడుతూ, నూతన జాతీయ విద్యా విధానం అనేక లోపాలతో కూడుకున్నదని ఆరోపించారు. ప్రధానంగా పేద ప్రజలకు విద్యను దూరం చేసేలా ఉన్నదని ఆక్షేపించారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసిన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో టీఎస్ఈసీ నాయకులు పీ ఈశ్వర్‌రెడ్డి, ఎం రఘుశంకర్‌రెడ్డి, కే నారాయణరెడ్డి, జిల్లా బాధ్యులు ఆవాల నరహరి, ఆర్ చంద్రశేఖర్, తూముల తిరుపతి, కే రాజమౌళి, వేల్పుల రత్నం, తిరుపతిగౌడ్, రమేశ్, నర్సయ్య, రాజేందర్, శంకర్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అయ్యో తల్లీ

- నాలుగేళ్ల కూతురుతో సహా బావిలో దూకి బలవన్మరణం
- భర్త, అత్తింటి వేధింపులే కారణం
- జగిత్యాల జిల్లా అర్పల్లిలో విషాదం



మౌనిక, సాహితి (ఫైల్)

సారంగాపూర్, జూన్27: అత్తింటి వేధింపులను ఆ ఆడబిడ్డ భరించలేకపోయింది. తరచూ గొడవలతో జీవితంపై విరక్తి చెందింది. తన నాలుగేళ్ల వయసున్న బిడ్డతో కలిసి ప్రాణాలు తీసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా అర్పల్లి గ్రామానికి చెందిన బొండ్ల సురేశ్‌కు బీర్‌పూర్ మండలంలోని మంగెళ గ్రామానికి చెందిన మౌనికతో 2020లో వివాహం జరిగింది. ఏడాది పాటు భార్యాభర్తలు అన్యోన్యంగానే ఉన్నారు. వీరికి 2021లో కూతురు సాహితి జన్మించింది. వివాహ సమయంలో కట్నం కింద ₹5లక్షలు, ఏడున్నర తులాల బంగారం ఇచ్చారు. అయితే మూడేండ్ల నుంచి ₹2లక్షల అదనపు కట్నం తీసుకురావాలని భర్త సురేశ్‌తో పాటు అత్తింటివారు వేధిస్తున్నారు. ఈ విషయమై పలు సార్లు గొడవలు జరిగాయి. పది రోజుల క్రితం మౌనిక పుట్టింటికి వెళ్లింది. మూడు రోజుల క్రితం ఆడబిడ్డ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి మౌనిక తన అత్తగారింటికి వచ్చింది. బుధవారం తన అక్క జమునకు ఫోన్ చేసి తనపై వేధింపులు ఆగడం లేదని రోదిస్తూ తెలిపింది. అయితే తాము వచ్చి మాట్లాడుతామని ధైర్యంగా ఉండాలని అక్క చెప్పింది. ఈ క్రమంలో బుధవారం గొడవ జరగగా మౌనిక మనస్తాపం చెందింది. తన నాలుగేళ్ల కూతురుతో కలిసి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. గురువారం మౌనిక, సాహితి మృతదేహాలను స్థానికులు బావిలో గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం జగిత్యాల దవాఖానకు తరలించారు. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్, తహసీల్దార్ రమేశ్ ప్రభుత్వ దవాఖానలో మృతదేహాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మౌనిక సోదరుడు గంగాధర్ ఫిర్యాదుతో భర్త సురేశ్, అత్త జల, అమ్మమ్మ గంగవ్వపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు
# దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 27: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ చేనేత కళాకారులకు అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ 31 నాటికి 30 ఏళ్లు నిండి, చేనేత రంగంలో కనీసం పదేళ్ల అనుభవం కలిగిన వారు, 25 ఏళ్ల వయస్సు నిండి చేనేత రంగంలో ఐదేళ్ల అనుభవం కలిగిన చేనేత డిజైనర్స్ అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు ఫారం పూరించి నైపుణ్యతను చాటే నమూనాలను శాంపిల్స్‌తో కరీంనగర్‌లోని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో జూలై 5 వరకు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి ఆగస్టు 7న అవార్డులు ప్రదానం చేస్తారని చెప్పారు.


# రైస్‌మిల్లులపై 'టాస్క్‌ఫోర్స్'

- సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు రంగంలోకి అధికారులు
- జగిత్యాల డీఎస్‌వో, డీఎం ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు
- జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని మిల్లులపై దాడులు
- మిల్లుల్లో సీఎమ్మార్ ధాన్యం లేనట్టు గుర్తించిన అధికారులు?



ఇల్లందకుంట: శ్రీరాములపల్లి శ్రీ సీతారామ మిల్లులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

జమ్మికుంట/ఇల్లందకుంట జూన్27: జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని రైస్‌మిల్లులపై స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఆకస్మికంగా దాడులకు దిగడంతో కలకలం రేగింది. సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు ఓఎస్డీ ప్రభాకర్ నేతృత్వంలోని లక్ష్మారెడ్డి, జంగయ్య, కృష్ణతో కూడిన అధికారుల బృందం గురువారం సాయంత్రం జమ్మికుంట మండలం కోరపల్లి శివారులోని మహాశక్తి రైస్ మిల్లు, ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలోని సీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఆకస్మిక దాడులు చేసింది. వీటిలో సీఎమ్మార్ ధాన్యాన్ని గుర్తించేందుకు జగిత్యాల జిల్లాకు చెందిన డీఎస్‌వో వెంకటేశ్, డీఎం హథీరాం ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారులు రంగంలోకి దిగారు. రాత్రి పొద్దుపోయేదాకా మిల్లుల్లో తనిఖీలు చేశారు. సీఎమ్మార్ ధాన్యంలో తేడాలు ఉన్నట్టు తెలిసింది. కాగా, హుజూరాబాద్ డివిజన్‌లోని మిల్లర్లు సీఎమ్మార్ ధాన్యాన్ని గోల్‌మాల్ చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కమిషనర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ బృందాన్ని రంగంలోకి దించి జమ్మికుంట రైస్‌మిల్లుల్లో మరోసారి దాడులు చేయించారు. కోరపల్లి, శ్రీరాములపల్లి మహాశక్తి, సీతారామ రైస్ మిల్లులు ఒకే యాజమానికి చెందినవని తెలుస్తున్నది. సదరు మిల్లర్‌పై గతంలో అనేక ఆరోపణలుండగా, సీఎమ్మార్ పెట్టలేదనే కారణంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు కూడా చేశారు. అప్పుడు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో సదరు మిల్లర్‌కు మళ్లీ 2022-23, 2023-24కు సంబంధించిన వానకాలం, యాసంగి ధాన్యాన్ని అధికారులు కేటాయించారు. అయితే ఈ రెండు సీజన్లకు సంబంధించి సీఎమ్మార్ ధాన్యం మిల్లుల్లో లేదని కమిషనర్‌కు ఫిర్యాదు అందినట్లు సమాచారం కాగా, ఈ నేపథ్యంలోనే టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. రెండు మిల్లుల్లో సీఎమ్మార్ వ్యత్యాసాన్ని గుర్తించినట్టు తెలిపారు. నివేదికను కమిషనర్‌కు అందిస్తామని వెల్లడించారు. దాడుల్లో హుజూరాబాద్, వీణవంక తహసీల్దార్లు విజయ్‌కుమార్, లక్ష్మణ్, డీటీలు వసంత్‌కుమార్, వేణుగోపాల్(సీఎస్), ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఇల్లందకుంట, జమ్మికుంట ఎస్ఐలు రాజ్‌కుమార్, రాజేశ్ పాలుపంచుకున్నారు.



గురువారం రాత్రి కరీంనగర్‌లో పడుతున్న వర్షం



కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో



చందుర్తి : మల్యాలలో అలుగు దుంకుతున్న వెంగళ చెరువు

# చినుకు కురిసింది.. విత్తు పడింది

వాన పడింది. చినుకు చినుకు కలిసి వరద పోటెత్తింది. ఆ వరదతో మల్యాల చెరువు మత్తడి దుంకింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు.. గురువారం రాత్రి నుంచి అక్కడక్కడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. దీంతో కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు ఊరట దొరికింది. ఎక్కడ చూసినా సాగు పనుల్లో బిజీ అయింది. ఎక్కడ చూసినా దుక్కులు దున్నుతూ.. విత్తనాలు వేస్తూ కనిపించింది.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ చందుర్తి, జూన్ 27

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571